క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక


ప్రశాంతి

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తాడ్డి ప్రశాంతి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. స్పోర్ట్స్ కోటాలో సదరు విద్యార్థినికి నూజివీడు కళాశాలలో సీటు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు శనివారం తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని ఆయన అన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


ర్యాలీ చేస్తున్న దృశ్యం

వంగర: చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నిర్మూలించేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని పాస్టర్ కె.డేవిడ్‌పాల్ కోరారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా మండలంలోని కొప్పర, బంగారువలస గ్రామాల్లో శనివారం ర్యాలీ చేపట్టారు. 'సేవ్ ద ఉమెన్' అంటూ నినాదాలు చేశారు. అత్యాచారాలకు పాల్పడిన వ్యక్తులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

షిఫ్ట్ ఆపరేటర్ సేవాభావం


రక్తదానం చేస్తున్న అశోక్


వంగర: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నడుకూరు అశోక్ రక్తదానం చేసి ఒకరి ప్రాణాలు కాపాడారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత రక్తహీనతతో బాధపడుతోంది. ఆమెకు తక్షణమే రక్తం అవసరమని జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వాటిని చూసిన అశోక్ వెంటనే స్పందించారు. హుటాహుటీగా పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఇప్పటికే మూడుసార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు, ట్రాన్స్‌కో అధికారులు ఆయన్ను అభినందించారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ


చెరువులోకి చేపలను విడిచిపెడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: గంబూషియా చేపలతో దోమలను నివారించవచ్చని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి అన్నారు. స్థానిక మల్లందేవి పార్క్ వద్ద ఉన్న చెరువులో మలేరియా నివారణ అధికారుల ఆధ్వర్యంలో గంబూషియా చేపపిల్లలను శనివారం విడిచిపెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ చేపలు దోమ లార్వాలను ఆహారంగా తీసుకుంటాయని, దీంతో దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, బొబ్బిలి మలేరియా యూనిట్ సిబ్బంది ఎంఎస్‌యావో బి.బలరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ఇటీవల ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని కిమిడి రాజేశ్వరిని ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. ఉన్నత విద్య అభ్యసించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ విద్యార్థినిక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, అదపాక దామోదరదరావు, తదితరుతు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు అడ్మిషన్లు

రేగిడి: మండలంలో ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో మిగులు సీట్లు భర్తీకి అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ పేడాడ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతిలో ఎస్సీ కేటగిరిలో 23 సీట్లు, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ సీఈసీలో 35 (ఎస్సీ, ఎస్టీ) సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఈనెల 30లోగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకుంటే వెంటనే అడ్మిషన్ ఇస్తామని వివరించారు.



రక్షణ చట్టాలు పటిష్టం చేయాలి

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు వస్తుంటారు. ఒక్కోసారి కొందరు రోగులు ఏదో ఎమోషన్‌లో వైద్యులు, సిబ్బందిపై దూకుడుగా వ్యవహరిస్తుంటారు. ఈ పరిస్థితులు ఎదుర్కొనేందుకు ప్రతీ పీహెచ్‌సీకి సెక్యూరిటీ టీంలు ఉండాలి. డే అండ్ నైట్ డ్యూటీలు చేసే నైట్ వాచర్‌లు, సెక్యూరిటీ గార్డులను నియమించాలి. పోలీసులు అందుబాటులో ఉండేలా చూడాలి. వైద్యులు, సిబ్బందిపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించేలా చట్టాలను పటిష్టం చేయాలి.

– డాక్టర్ గట్టి భార్గవి, వైద్యాధికారి, పొగిరి పీహెచ్‌సీ



వైద్య సిబ్బందికి భద్రత అవసరం

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించే చోట మహిళా వైద్యులతో పాటు వైద్య సిబ్బంది చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య శిబిరాల నిర్వహణ సమయంలో వారికి భద్రత అవసరం. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. హెల్త్ ఎంప్లాయీస్ ప్రొటెక్షన్ టీంలు ఏర్పాటుచేయాలి. ఆస్పత్రుల్లో మహిళా సిబ్బంది కోసం రెస్ట్ రూంలు కేటాయించాలి. దాడులకు పాల్పడుతున్న వారికి కఠిన శిక్షలు విధించాలి.

– డాక్టర్ సిద్ధేశ్వరి, వైద్యాధికారి, బొద్దాం పీహెచ్‌సీ



నేత్రదానం చేద్దాం.. అంధులకు చూపునిద్దాం..

- మరణించినా.. మరికొందరికి లోకం చూపించే అదృష్టం
- అపోహలు వీడి నేత్రదానానికి ముందుకురావాలని పిలుపు
- నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

రాజాం సిటీ: సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. జ్ఞానేంద్రియాలన్నింటిలోను ప్రధానమైనవి కళ్లు. వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. మనం మరణించినా మన కళ్లతో మరో ఇద్దరికి ఈ లోకాన్ని చూపే అదృష్టం నేత్రదానంతోనే సాధ్యం. నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయి. కంటి చూపు లేక చీకట్లో మగ్గుతున్న వారెందరికో కంటి చూపును ప్రసాదించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి నేత్రదానం చేయాలి.

నేత్రదానం ఎవరికి అవసరం..

కంటిలోని కార్నియాపైన మచ్చలు ఉన్నవారికి నేత్రదానం అవసరం. నల్లగుడ్డుపై మచ్చలు ఏర్పడడానికి ప్రధానంగా చిన్నారుల్లో పోషకాహార లోపం, మీజిల్స్, సంక్రమణ కంటి వ్యాధులు, గాయాలు బారిన పడడం, కంటి శస్త్ర చికిత్సలు అనంతరం ఇన్ఫెక్షన్స్ సోకడం, పుట్టుకతో వచ్చే కంటి వ్యాధులు కారణంగా చూపు దెబ్బతిన్నవారికి అవసరం. ఈ నేత్రదానంపై అపోహలు ప్రజల్లో తొలగించేందుకు 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 9వరకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

ఎవరైనా నేత్రదానం చేయవచ్చు..

నేత్రదానం చేయడానికి వయసుతో పనిలేదు. ఏ వయసు వారైనా నేత్రదానం చేయవచ్చు. కళ్లజోడు పెట్టుకునేవారు, అధిక బీపీ, మధుమేహం, ఉబ్బసం వ్యాధులు ఉన్నవారు, కంటి శుక్లాలు (క్యాటరేక్ట్) ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా చేయవచ్చు. నేత్రదానంలో కంటిలోని కార్నియాను, శరీరం నుంచి పది మిల్లీమీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు. అలాగే ఎయిడ్స్, పచ్చకామెర్లు, కుక్క కాటు, బ్లడ్ క్యాన్సర్, సెప్టీసిమీయా వ్యాధులతో చనిపోయిన వారి కళ్లు దానానికి పనికిరావు.


సత్యవతి నేత్రాలను సేకరిస్తున్న వైద్యుడు (ఫైల్)

ఇవి పాటించడం తప్పనిసరి..

వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలను తీయాలి. ఐ బ్యాంకు డాక్టర్‌గాని, శిక్షణ పొందిన టెక్నీషియన్ మాత్రమే స్టెరైల్ పద్ధతిలో కార్నియాను బయటకు తీస్తారు. వీరు మృతదేహం ఉంచిన చోటుకే వచ్చి రక్తస్రావం లేకుండా 15 నుంచి 20 నిమిషాల్లో కళ్లు సేకరిస్తారు. మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను దానం చేయాలనుకుంటే రెండు కంటి రెప్పలు మూసివేసి, రెండు కళ్లమీద నీటిలో ముంచిన గుడ్డను వేయాలి. తలకింద దిండు పెట్టాలి.

కుటుంబ సంప్రదాయంగా చేసుకున్నాం..



నేత్రదానం మా కుటుంబ సాంప్రదాయంగా చేసుకున్నాం. ఇప్పటి వరకు మా కుటుంబంలో ఐదుగురు సభ్యులు మరణానంతరం నేత్రదానం చేశాం. ప్రతి ఒక్కరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావడం ద్వారా ఎంతో మంది అంధులకు చూపును ప్రసాదించవచ్చు.

– సప్పటి వసంతరావు, రొటేరియన్, ఆప్తాల్మిస్ట్, పెరుమాళి పీహెచ్‌సీ

మా అమ్మ కళ్లను దానం చేశాం..



ఇటీవల మృతి చెందిన మా అమ్మ బండి సత్యవతి కళ్లను శ్రీకాకుళం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఐ బ్యాంకుకు దానం చేశాం. ఆమె కళ్లు ఇప్పటికీ సజీవంగానే ఎక్కడో ఉన్నాయనే సంతృప్తి ఉంది. గతంలో మా కుటుంబంలో మా పెదనాన్న బండి తవిటినాయుడు కళ్లను కూడా దానం చేశాం. ఇటువంటి మంచి కార్యక్రమానికి మా కుటుంబం ముందుకురావడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలి.

– బండి నర్సింహులు, జెడ్పీటీసీ, పెనుబాక, రాజాం మండలం

బాధ్యతల స్వీకరణ


రామభద్రపురం: ఎస్ఐ ప్రసాదరావు


తెర్లాం: ఎస్ఐ సాగర్‌బాబు

రామభద్రపురం: పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా వెలమల ప్రసాదరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన జ్ఞానప్రసాద్ బదిలీపై విజయనగరానికి వెళ్లారు. విజయనగరం పీటీసీలో పనిచేసిన ప్రసాదరావు ఇక్కడకు బదిలీ అయ్యారు. సిబ్బంది, ప్రజల సహకారంతో గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

తెర్లాం: పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బి.సాగర్‌బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా ఆర్.రమేష్ పనిచేయగా ఆయన స్థానంలో ఇప్పుడు సాగర్‌బాబు నియమితులయ్యారు.

రైతు సంక్షేమమే లక్ష్యం


కోటశిర్లాంలో సాగునీటి కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: రైతు సంక్షేమమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండలంలోని కోటశిర్లాంలో ఉన్న జంతిగెడ్డ చెక్‌డ్యామ్, పాడివానివలసలోని కంబాలపాలెం సాగునీటి కాలువ, ముచ్చర్లవలస, నరసాపురం మధ్యన ఉన్న మగతపాలెం సాగునీటి కాలువలను ఆయన శనివారం పరిశీలించారు. వాటి పరిస్థితి ఏమిటి.. గతంలో ఏమైనా చెక్‌డ్యామ్‌లు నిర్మించారా అని ఇరిగేషన్ ఏఈ హరిబాబుని అడిగి తెలుసుకున్నారు. ఏడేళ్ల క్రితం నీరు–చెట్టు కింద ఈ సాగునీటి కాలువలు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టగా, అప్పట్లో అవి వర్షాలకు రెండు మూడు నెలల్లోనే కొట్టుకుపోయాయని ఏఈ తెలియజేశారు. సాగునీటి కాలువల్లో పూడికల తీతకు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ఎంతమేర నిధులు అవసరముంటుందని ఎమ్మెల్యే అడగ్గా, దాదాపు రూ.2 కోట్ల నిధులు అవసరమవుతుందని ఏఈ చెప్పారు. ప్రతిపాదనలు తయారు చేయాలని ఏఈకి ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ముచ్చర్లవలస సర్పంచ్ కనిమెరక శంకరరావు, నాయకులు చింతల రామకృష్ణ, తాడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేప ద్రావణంతో నాణ్యమైన పంటలు


చేపద్రావణం తయారీని వివరిస్తున్న గౌరీశ్వరరావు

రాజాం: చేపద్రావణంలో నాణ్యమైన పంటలు పండించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు అన్నారు. రాజాం వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద శనివారం నియోజకవర్గంలోని అన్ని మండలాల రైతు సేవా కేంద్రాలకు చెందిన వీఏఏలు, రైతులకు చేపద్రావణం వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం రాష్ట్రపతి అవార్డు గ్రహీత పెంకి గౌరీశ్వరరావు చేపద్రావణం తయారీ విధానాన్ని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఘన, ద్రవ జీవామృతాల తయారీ, కాషాయాల తయారీ, చేపద్రావణం వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజాం, రేగిడి, వ్యవసాయశాఖ అధికారులు రేణుకాసాయి, మురళీకృష్ణ, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్, రాజాం ఏఎంసీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సక్రమంగా మెనూ అమలు చేయకపోతే చర్యలు


మధ్యాహ్న భోజనం వంటకాలు పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు, తదితరులు

తెర్లాం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని ఎంఈవో త్రినాధరావు హెచ్చరించారు. మండలంలోని లోచర్ల ప్రాథమిక పాఠశాలను విద్యా ప్రమాణాల తనిఖీ బృందంతో కలిసి శనివారం సందర్శించిన ఆయన.. పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, సబ్జెక్టుల వారీగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, చేతిరాత పుస్తకాలు, హోమ్‌వర్క్ పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, చేతిరాత, హోమ్‌వర్క్ పుస్తకాల మూల్యాంకనం, మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

27న మండల సమావేశం

రాజాం సిటీ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లావేటి సులోచన ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

చాటాయివలసలో పొలంబడి


అవగాహన కల్పిస్తున్న ఏఓ మురళీకృష్ణ తదితరులు

రేగిడి: మండలంలో చాటాయివలస గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ పద్ధతుల్లో వస్తున్న మార్పులను రైతులు అవలంబించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేసి లాభాలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరి శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనిబెల్లి రమణ, రైతులు పాల్గొన్నారు.

భగవన్నామ స్మరణే మోక్షమార్గం

రేగిడి: ప్రతి ఒక్కరూ సన్మార్గాన్ని అనుసరించాలని పాలకొండకు చెందిన సత్యసాయి సేవాసమితి ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ సూచించారు. మండలంలో గోపింపేట గ్రామంలోని ఆలయంలో శనివారం సత్యసాయి వ్రతాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రోజు భగవన్నామ స్మరణ చేయడం ద్వారా మోక్షం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు కేటాయించాలని కోరారు. మహర్షులంతా ఆధ్యాతిక సేవా కార్యక్రమాల ద్వారానే ముక్తిమార్గాన్ని పొందారని గుర్తుచేశారు.

రహదారి గోతుల పూడ్చివేత


బూరాడ జంక్షన్ వద్ద గోతులు పూడ్చుతున్న పోలీసులు

రేగిడి: మండలంలో బూరాడ జంక్షన్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ఆర్అండ్‌బీ రహదారిలో గోతులను రేగిడి పోలీసులు పూడ్చివేశారు. రాజాం–పాలకొండ ప్రధాన రహదారిలో బూరాడ కూడలి వద్ద రహదారిపై ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా మారాయి. ఈ విషయాన్ని గమనించిన ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు శనివారం సిబ్బందితో కలిసి కంకర, ఇసుకతో గోతులను పూడ్చారు. పోలీసుల సేవాభావాన్ని పలువురు అభినందించారు.

దరఖాస్తుల పరిశీలన


వెలగవలసలో దరఖాస్తులోని వివరాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్డీవో సుధారాణి

తెర్లాం: కుల ధ్రువీకరణ పత్రాల కోసం లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులు, వాటిల్లోని వివరాలను బొబ్బిలి ఇన్‌చార్జ్ ఆర్డీవో ఎం.సుధారాణి క్షేత్రస్థాయిలో శనివారం పర్యటించి, పరిశీలించారు. మండలంలోని వెలగవలస గ్రామానికి వెళ్లిన ఆమె.. దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలు సరైనవా.. కావా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గతంలో గ్రామాల్లో కులగణన సర్వే నిర్వహించి కులధ్రువీకరణ పత్రాలు లేని వారి వివరాలు నమోదు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఇప్పుడు ఈ గ్రామం నుంచి అధిక సంఖ్యలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. గతంలో కుల ధ్రుకరణ పత్రాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారా, లేదా అని లబ్ధిదారులను ఆమె అడిగి తెలుసుకోగా, అప్పట్లోనే మంజూరు చేశారని లబ్ధిదారులు చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్, వీఆర్‌వోలు రామయ్య, గణపతి, రోజా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోరా?


ప్రమాదకరంగా మారిన రోడ్డు ఇదే

రాజాం: పట్టణంలో శ్రీకాకుళం రోడ్డులో రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూం సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అయినా ఆర్అండ్‌బీ అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులతో పాటు ఈ ప్రాంత ప్రజలు మండిపడుతున్నారు.

ఉపాధ్యాయుల పనితీరు మెరుగ్గా ఉండాలి


విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షిస్తున్న ఎంఈఓ దుర్గారావు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పనితీరు మెరుగ్గా ఉండాలని ఎంఈఓ–2 యాగాటి దుర్గారావు అన్నారు. మండలంలోని గుయ్యానవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీచేశారు. విద్యార్థుల హాజరు శాతం, అభ్యసనా సామర్థ్యాలపై ఆరాతీశారు. ఉపాధ్యాయులు టీఎల్ఎంల సాయంతో విద్యాబోధన చేయాలని, ఆధునిక సాంకేతికతను బోధనలో వినియోగించుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చిరంజీవి, ఉపాధ్యాయులు సృజన, తదితరులు పాల్గొన్నారు.


రేగిడి: ఆమదాలవలస పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

విద్యాప్రమాణాలు బాగుండాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు బాగుండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలో ఆమదాలవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, పాఠశాల మెంటినెన్స్, ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల హాజరు, ఎస్ఎంసీ భాగస్వామ్యం తదితర అంశాలపై ఆరాతీశారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎం అరుణకుమారి, సీఆర్‌పీ లెంక ఆదినారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

భద్రతా ప్రమాణాలు పెంచాలి


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

బొబ్బిలి రూరల్: రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పెంచాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆర్.గోపాలం డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలోని ఫార్మా పరిశ్రమలో ఇటీవల జరిగిన ప్రమాద ఘటనకు వ్యతిరేకంగా మండలంలోని ఎం.బూర్జివలస గ్రామంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలాచోట్ల పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు విస్మరిస్తున్న కారణంగానే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, యాజమాన్యం తప్పిదం వల్లే కార్మికులు తమ విలువైన జీవితాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కూడా దుర్ఘటనలు జరిగినప్పుడే హడావిడి చేస్తున్నాయని, భద్రతా ప్రమాణాలపై పర్యవేక్షణ తూతూమంత్రంగా చేసి, విడిచిపెడుతున్నాయని విమర్శించారు. పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. అచ్యుతాపురం ఘటనకు సంబంధించి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సామాజిక తనిఖీలకు సహకరించాలి


మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ మన్మథరావు

బొబ్బిలి రూరల్: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, చేపట్టనున్న సామాజిక తనిఖీలకు సహకరించాలని ఎస్ఆర్‌పీ(స్టేట్ రిసోర్స్‌పర్సన్) కె.మన్మథరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి జరిగే ఈ సామాజిక తనిఖీలకు సంబంధించి, 4 గ్రామాలకు ఒక డీఆర్‌పీని నియమించామని, వారు గ్రామంలో జరిగిన పనులను గుర్తిస్తారన్నారు. పనుల నాణ్యత, కొలతలు, నిధుల ఖర్చు, వేతనాల జమ వంటి అంశాలతో పాటు పనుల్లోని లోపాలను వారు గుర్తిస్తారన్నారు. 15 రోజుల్లోగా ఈ తనిఖీలు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.రవికుమార్, మండల ఇంజినీరు రాజశేఖర్, హౌసింగ్ ఏఈ అల్లు సూర్యనారాయణ, ఉపాధి హామీ పథకం ఏపీవో లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి


విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈవో తిరుమలప్రసాద్

రామభద్రపురం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో తిరుమలప్రసాద్ సూచించారు. మండలంలోని జన్నివలస గ్రామ ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం సందర్శించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలతో పాటు మధ్యాహ్న భోజనం వంటకాలను ఆయన పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అలాగే ప్రతిరోజూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వంటకాలు వండిపెట్టాలన్నారు. భోజనం నాణ్యతలో తేడా వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో రోజుకో టీచర్ చొప్పున బాధ్యత తీసుకుని మధ్యాహ్న భోజనం రుచిగా వండించాలన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

రాజాం, సంతకవిటి మండలాల్లోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టి కొడుతూ సందడి చేశారు. సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. రాజాం పట్టణంలో, బొద్దాం గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక బొద్దాం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. – రాజాం/రాజాం సిటీ/సంతకవిటి


రాజాం సిటీ: చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న సన్ స్కూల్ విద్యార్థులు


సంతకవిటి: వైజ్ పాఠశాలలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న చిన్నారులు


రాజాం: చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో రెయిన్‌బో ప్లే స్కూల్ చిన్నారులు